# యుగయుగాల సమస్య

చైతన్య చీకటితోలేచి చెప్పులు వేసుకుని తలకు తువాలచుట్టుకొని చేతి కర్రతో ఆ ఊరంతా ఒకసారి చుట్టి వస్తాడు. అతడు తన నడకను ఎక్కడ ప్రారంభించాడో తిరిగి అక్కడికే వస్తాడు. కృష్ణానది ఒకపాయ ఆ ఊరిమీదుగా ముందుకు ప్రవహిస్తుంది. ఆ నది ఒడ్డున ముఖమార్జన చేసి, కాలువలో నీరు కడవతో కొబ్బరి చెట్లకూ, అరటి చెట్లకూ పాదులుచేసి పోస్తాడు. ఆ నది ఆ ఊరిలో ప్రవహించినది మొదలుకొని ఆ ఊరు దాటేవరకూ కనీసం రెండుసార్లు ఈతకొడతాడు. ఈ లోపల ఏడు గుఱ్ఱాలదొర వస్తున్నాడని తెలిపే జాజురంగు ఛాయలు ఆకాశంలో తూర్పుబాగాన గోచరిస్తాయి. "ఆఁ ఇంక ఆదిత్యుడు ఉదయిస్తాడు. అవిగో అరుణచ్ఛాయలు" మనసుకుదుపుతుంది.

సూర్యోదయమయ్యేంతలో స్నానం ముగించి, తడిబట్టతో చేతులు జోడించి, ఆదిశకేసి చూస్తూ నిలబడతాడు. కొంతసేపటికి సూర్యబింబంలో రవంత భాగం పొడచూపుతుంది. ఆ పైన గబగబా పైకి లేస్తుంది.

సూర్యుడు రవంత కనబడగానే సూర్యనమస్కారాలు ప్రారంభిస్తాడు చైతన్య. సూర్యబింబం పూర్తిగా పైకి లేచేటప్పటికి చైతన్య ఆ బింబాన్ని చూస్తూ ఆ నదీ తీరంలోనే నిలబడి ప్రదక్షిణాలు చేస్తాడు. దేహమంతటా సూర్యరశ్మి ప్రసరించాలని- ఆ సూర్యరశ్మివల్లనే అతడికి విటమిన్ డి లభిస్తుందనీను.

మరి వెచ్చదనం పోయి, దేహానికి వేడి తగిలే వరకూ ఒడ్డున ఉండి, పది అడుగుల సమీపంలో ఉన్న తన గదిలో ప్రవేశించి బట్టలు వేసుకుంటాడు.

బట్టలంటే ఏమిటి? సూటా? పేంట్ మీద బుష్‌షర్టా? ఎక్కడికైనా వెళ్లాలన్న తొందరా?

అటువంటివేమీ ఇప్పుడులేవు.

ఆ క్రిందటిరోజు తాడుమీద ఆరవేసుకున్న ధోవతి ధరించి, దానిపైన సగంచేతుల కాలరులేనిషర్టు వేసుకుని గుండీలు పెట్టుకుంటాడు. అవే అతడు పక్కఊళ్ళో కొనుక్కున్న జత బట్టలు.

ఐదు సంవత్సరాల క్రిందట-తన గదికి రెండు ప్రక్కల- ముందు భాగంలో-కొబ్బరి మొక్కలు అమ్మవస్తే కొని నాటాడు. అరటి పిలకలు ఈత కొడుతుండగా కాలువ ఒడ్డున కనబడితే తెచ్చి పెరటిలో వరసగా నాటేడు. ఆ చెట్లే ఇప్పుడు కాపుకు వచ్చి, అతడికి ఆహారాన్నిస్తున్నాయి. కొబ్బరికాయనొకటి పీచుతీసి కొట్టి ఆ కొబ్బరినీళ్ళను తాగుతాడు. దానిలోని లేత కొబ్బరయితే, కొబ్బరికాయ పెంకుతో గీకి, తింటాడు. కొబ్బరి ముదిరినట్లయితే చాకుతో తీసి ముక్కలు చేసి తింటాడు.

ఇదంతా అయ్యేసరికి తొమ్మిది గంటలవుతుంది. అప్పుడొకసారి గది తలుపులు దగ్గరకువేసి, ఆ ఊరి ప్రజలనందరినీ ఒకసారి ఇళ్ళకు వెళ్ళి కలుసుకుంటాడు. అతడికి వాళ్ళభాషతెలియదు. కాని-చూసి నమస్కారం పెడతాడు. తిరిగివాళ్ళూ పెడతారు. అందరూ క్షేమమా అన్నట్లు చేత్తో సైగ చేస్తాడు. వాళ్ళది అర్థంచేసుకుని తలలూపుతారు.

ఇలా ఒక వారం గడిచినతరువాత-ఒక ఆసామీ చైతన్య తిరిగి వెళ్ళేటప్పుడు అతడిననుసరించి వెళ్లాడు.

ఊరి చివర-జనసంచారంలేని నదీ తీరాన-ఆకులతో కొమ్మలతో కప్పిన కప్పుతో, మట్టిగోడల చిన్నగది-దాని ముందర కొబ్బరి ఆకులతో వేసిన చిన్న పంచ-ఆ గదిచుట్టూ కొబ్బరి చెట్లూ- పెరట్లో అరటిచెట్లూ ఉన్నాయి. ఆ ప్రదేశం చుట్టూ పెద్ద పెద్ద చెట్లు ఉన్నాయి. చెట్ల నీడన నీటిమీదినుంచి వచ్చేగాలి చల్లటి వాతావరణాన్ని కల్పిస్తున్నది. మండుటెండలో కూడా-ఆ చల్లటి వాతావరణంలో-ఆ పంచలో-కొబ్బరాకుల చాపమీద కూర్చుని-అతడు గ్రంథమొకటి చేతబట్టగా అల్లంత దూరంనుంచి చూసి ఆసామీ వెనక్కు మళ్ళాడు.

మధాహ్నం పన్నెండు గంటలవరకూ అతడు గ్రంథ పఠనంచేసి, పెరట్లోకి వెళ్ళి అరటి గెలలోని రెండు పళ్ళు తీసి తింటాడు.

ఆ పంచలో కొబ్బరాకుల చాపమీద తువాల తలక్రింద పెట్టుకుని

ఆలోచిస్తూ పడుకుంటాడు. ఆ కళ్ళు ఎక్కడో చూస్తాయి. మనసులో ఆలోచనలు ముసురుకుంటాయి. ఊహలు ఎటో పరుగులు తీస్తాయి. అనుభవాలు కడుపును మండిస్తాయి. అంతలోకి ఆవేశం తగ్గి ఆనకట్ట కడుతుంది వాటికి.

ఆ చల్లటి వాతావరణంలో-మధ్యాహ్నం రెండుగంటల వరకూ నిద్ర పోతాడు. లేచిన వెంటనే కుండలో పట్టిఉంచిన చల్లటి మంచినీళ్ళను తలమీద చల్లుకుని మనసును శాంతింపచేసుకుని గ్లాసెడు మంచినీళ్ళు తాగుతాడు.

తిరిగి చాపమీద కూర్చుని చాక్‌పీసుతో నేలమీద గీతలు గీస్తాడు.

మనిషి కనబడని ఆ ప్రదేశంలో అతడు చాక్‌పీస్‌తో గీసేవి అక్షరాలా! సిద్ధాన్త గ్రంథంలోని ప్రథానాంశాలా? దైవ సాన్నిధ్యానికి చేరుకునే మార్గాలా? శాంతిమార్గానికి సూచనలా? ఆశయసిద్ధిని పొందే సాధనలా?

కావు-అవేవీకావు. నిజంగా అవే అయితే వాటిని అర్థంచేసుకుని ముందుకు సాగిపోతాడు.

కాని అతడిని- కడుపునిండాఉన్న దుఃఖం లోబరచుకుంటుంది ఒక్కోసారి అతడు గీసినవి నిట్టనిలువు గీతలుకావు. రేఖా చిత్రాలు మొదటిదానిలో గీసినవి ఇద్దరు చిన్నపిల్లల చిత్రం. ఆ చిత్రంలోని బొమ్మలు చిన్న ముఖాలు-రెండు చిన్న జడలు-గౌన్లు వేసుకుని సంచులు బుజానికి తగిలించుకుని కాళ్ళకు బూట్లతో స్కూలుకు వెళ్ళడానికి వాకిట్లోకి వచ్చాయి. రెండూ ఒక్కమాదిరిగా ఉన్నాయి. కవలపిల్లల్లాగ.

రెండవది-నాలుగు సంవత్సరాల మగపిల్లవాడి బొమ్మ. స్కూలు యూని ఫారమ్‌లో ఉన్నాడు. రెండు బిస్కెట్లు జేబులో వేసుకుని ఆడపిల్లల వెనక వాకిట్లోకి వచ్చాడు.

మూడవది-రెండు బొమ్మలు. వాటిలో ఒకటి స్త్రీ మూర్తి. చీరె ధరించి, నుదుట కుంకుమపెట్టుకుని. తలలో మందారపువ్వు పెట్టుకుని వాకిటి వరెండాలో కూర్చున్నది చెక్కిట చెయ్యి చేర్చుకుని రెండవ బొమ్మ ఒక పురుషుడిది-ఆమెకు దగ్గరగా కుర్చీలో కూర్చున్నాడు. ఆ రెండు బొమ్మలూ జీవన సంధ్యను చేరు కున్నట్టుగా ఉన్నాయి. పెదవులు కదులుతున్నాయి. అవి వారిద్దరి సంభాషణలు కాబోలు.

నాలుగవది-ఒక యువతి. చిరునవ్వులుచిందిస్తూ ముందు బయలుదేరుతున్న పిల్లలను చూసి మురిసిపోతున్నది.

అతడు పిల్లల బొమ్మలను చూసి తన వేళ్ళతోతాకి పెదవుల కానించుకున్నాడు. కన్నీటి బొట్లురాలేయి.

ఆ పెద్దలనిద్దరినీ చూసి భక్తితో ఆపాదాలను కళ్ళకద్దుకున్నాడు. కళ్ళు చెరువులయ్యాయి.

ఆ యువతినిచూసి సమ్మోహనంగా ఒక చిరునవ్వు నవ్వి, చెయ్యి ఊపాడు. గుండె బీటలు వారింది.

ఆ తరువాత -అతడికి కన్నీళ్ళు చెంపలమీదుగా జాలువారాయి.

ఎంత సేపు అట్లా ఉన్నాడో? కళ్ళు తుడుచుకుని, దిగాలుపడి గోడకానుకుని కూర్చున్నాడు.

కొంత సేపటికి తలవిదిలించుకుని, ఆ బొమ్మలను నీటితో తుడిచేసి, చల్లటి నీళ్ళతో ముఖం కడుక్కుని గ్రంథమొకటి చేతబట్టుకుని కూర్చున్నాడు. మనసులో సముద్రఘోష.

మానవుడి జీవిత పథం ఏమిటి?

మానవుడి భావాలు ఏ దశలో పరిపక్వతకు చేరుకుంటాయి?

నాలుగు ఆశ్రమాలలో ఏ ఆశ్రమంలో ఏ భావము అతడిలో సంచలనాన్ని కలిగించి మార్పును తెస్తుంది?

అతడి మనసులో ఒక్కొక్క అంశంపైన అనంతమైన చర్యలు సాగుతున్నాయి.

గ్రంథాన్ని యథాస్థానంలో ఉంచి పంచచివరన కూర్చున్నాడు జిజ్ఞాసతో.

ఆ గ్రామంలో ఆ సంవత్సరం వర్షాభావంతో పొలాలన్నీ ఎండిపోతున్నాయి. కాలువలో నీరు తగ్గిపోయింది. ఆ నీరేపోసి పంటలు పండిస్తున్నారు రైతులు. ఆ పంట ఆ గ్రామానికి చాలినంతలేదు. ఆకలిమంటలు అక్కడక్కడ కనబడుతూ వినబడుతున్నాయి.

చైతన్య గ్రామాన్నిచుట్టి వచ్చేటప్పుడు పిల్లల ఏడ్పులు, పెద్దలు తలలపైన చేతులుపెట్టుకుని అక్కడక్కడ గుడిసెలముందర కనబడ్డారు

చైతన్య ఆ గ్రామానికి వచ్చినతరువాతనే అదివరకూ ఎరుగని ఆకలి మంటలను చవిచూశాడు. ఇప్పుడు కంటితో చూస్తున్నాడు. పరిస్థితులు అర్థమవుతున్నాయి.

చైతన్య వెంటనే బుజమ్మీది తువాలను తీసుకుని జోలెగాకట్టి ఇంటింటికీ వెళ్ళి ఏవైనా ఆహారధాన్యాలు గుప్పెడువెయ్యమని చేతిసైగలుచేశాడు.

మొదటిరోజున అందరూ అతడినిచూసి తెల్లబోయారు. ఇతడు ఇంతకాలం నుంచీ ఏంతింటున్నాడు ? ఇవాళ జోలెపట్టేడు ? ఇప్పుడు ఈ దుర్భిక్షంలో చెయ్యి చాపుతున్నాడు ?

ఒక్కొక్కయింట్లో అతడి ముఖంచూపి అర్థశేరు, పావుశేరుగింజలు పోశారు. కొందరు దోసెళ్ళతోపోశారు. కొందరు గుప్పెళ్ళతో తెచ్చారు.

ఏడుపులు వినబడుతున్న గుడిసెలలోకివెళ్ళి కొద్దికొద్దిగా వాటిని పంచియిచ్చాడు- గంజిచేసుకుని తాగమని చేతిసైగచేస్తూ, అవి నూకలు.

ఆ పగలు వాళ్ళనుపిలిచి కాలువపొడుగునా ఉన్న భూమిని దున్నుకుని పంటలు పండించుకొమ్మని సైగలుచేశాడు. వాళ్ళు పని ప్రారంభం చేసుకుంటున్నారు. సాగుచేసుకోవటం మొదలుపెట్టారు.

ఒకనాడు ఒక ఆసామివచ్చి, అతడికి చేతులుజోడించి "ఇదంతా ఏమిటి ? ఈభూమి ఎవరిది ? మీరు ఎవరికి ఇస్తున్నారు ?" అన్నట్లు సైగలతోనే అడిగాడు.

"ఈపది ఎకరాలభూమి నాది" అన్నాడు అతడికి అర్థమయేటట్టుగా. ఆ ఆసామీ వెళ్ళి ఊరిపెద్దకు చెప్పాడు. ఆ గ్రామపెద్దలలో ఒక వృద్ధుడు ఆ ఊరి పుట్టుపూర్వోత్తరాలతో బాగా పరిచయం ఉన్నవాడు కొంతమందిని చూసినవాడు. అందరినీ చుట్టూ కూర్చోబెట్టుకుని చెప్పటం మొదలుపెట్టాడు.

'ఆ ప్రాంతంలో ఒక పెద్ద పండితుడు ఉండేవాడు. ఆయన పాండిత్యానికి మెచ్చి అక్కడి ప్రభువు రెండుగ్రామాలను దానంచేశాడు పెద్దభవనంతోకూడా. ఆ గ్రామాలలో పంటతక్కువ. పైగ్రామాలనుండి గ్రాసం తెచ్చుకోవాలి. ఆ పండితుడి కొడుకులకాలంలో భూమిని కొద్దికొద్దిగా అమ్మటం ప్రారంభించారు. మూడవతరంలో యువకులు పట్టణాలకువెళ్ళి చదువుకుని ఉద్యోగాలు చేసుకోవటం

మొదలు పెట్టారు. చివరకు మిగిలింది ఒకకుటుంబం- తల్లిదండ్రులూ ఒకకొడుకు. అతడుకూడా చదువునిమిత్తం పట్టణాలకువెళ్ళి పెద్దచదువులు చదివాడు. లాయరు వృత్తిని చేపట్టాడు.

అప్పటికి గ్రామంలో ఆ కుటుంబానికి మిగిలింది పది ఎకరాల మెట్టభూమి ఒక పెద్ద శిథిలమవుతున్నభవనం. వృద్ధాప్యంలో వాళ్ళుకూడా ఒంటరిగా ఉండలేక కొడుకుదగ్గరికి వెళ్ళారు. ఏడాదికొకసారివచ్చి, ఆ శిథిలభవనాన్నీ భూములను చూసుకుని వెళ్ళారు.

ఈ విషయాలను తెలుసుకున్న గ్రామీణులు అతడిపట్ల గౌరవభావాన్ని పెంచుకున్నారు అతడు ఆ భవనంచుట్టూఉన్న భూమినికూడా పేదలకిచ్చివేశాడు. గ్రామీణులు ఆ భూమిలో ఏదిపండితే దానినే తింటున్నారు.

ఇప్పుడాగ్రామంలో ఆకలిఏడ్పులు వినబడటంలేదు. అతడు భవనాన్ని పూర్తిగా నేలమట్టంచేయించి చుట్టూకంచెవేసి లోపల మరికొన్ని కొబ్బరి, అరటి చెట్లువేసి మధ్యగా ఒకగదిని నిర్మాణం చేయాలన్న ఊహతోఉన్నాడు. అప్పుడు ప్రస్తుతం తానున్న స్థలాన్నికూడా ఎవరికయినా ఇవ్వాలన్న భావంతో ఉన్నాడు.

గ్రామీణులతో ఆత్మీయత పెరుగుతున్నా భాష అర్థంకాకుండాఉంది. వాళ్ళతో ఒకరినిపిలిచి ఒక్కొక్కమాట రాసుకుని అర్థాలు చెప్పించుకుంటున్నాడు.

ఆ వంశీయులలో ఆదిపురుషుడైన ఆనందమోహన్ పంతులవారి పేరు చైతన్య. అతడి తండ్రి పెద్దలపేరు కొడుక్కి పెట్టినట్టున్నాడు. ఇతడి పూర్తి పేరు చైతన్యానందమోహన్.

చైతన్య మహానగరాలేకాక విదేశాలకువెళ్ళి బారెస్టరయినాడు. తిరిగి స్వదేశానికి వచ్చి మహానగరంలో పనిచేస్తున్నాడు. మంచి సంపాదన. గ్రామంలోఉన్న భవనంకంటె మించినదాన్ని కట్టాడు. కుటుంబం ఉన్నతమైనది కనుక తల్లిదండ్రులను తీసుకువచ్చి వారితో ఉంటున్నాడు. అతడు ముగ్గురుపిల్లలతండ్రి. కొడుకు మాత్రం ఒక్కడు.

ఆ పండిత కుటుంబంలోఉన్న వారందరికీ ముట్టుకుంటే మాసిపోతారేమో నన్నట్టుగా ఉంటుంది వారి దేహచ్ఛాయ. అందరూ భారీమనుష్యులు. దేహపుష్టి గలవారు వారి ఆహారం జొన్నరొట్టెలు. ఆ ఊరిలో చాలామంది తినే ఆహారమదే.

వాటికనువైన కూరలూ పెరుగు.

చైతన్య పెరిగిన ఇల్లు ఇంద్రభవనంలా ఉండేది. ఆ దీపాల వెలుగులో చైతన్య ధగధగ మెరిసిపోయేవాడు. ఆ యింటిని మించిన ఇల్లు నగరంలోకట్టాడు. గాని పురాతనం దానిమీదఉన్న అభిమానం కొత్తదానిమీద కలగలేదు.

కాని-నిన్నా మొన్నా ఉన్న వాతావరణం- పరిస్థితులు ఇవాళకూడా ఉంటా యనుకుంటారు సామాన్యంగా. అది మానవుడి ప్రవృత్తి ఆశలవలయం.

గాలి గట్టిగా వీచితే- ఎండ మండుటెండయితే- వర్షం వరదలయితే- మానవుడు దానవుడయితే- అదృష్టం తలక్రిందులవుతుంది.

ప్రకృతి తన ధర్మాన్ని సమపాళంగా నిర్వర్తించి- పంటలు బాగాపండి- ప్రజలు సంతుష్టులై జీవిస్తూఉంటే- సృష్టిదేవత ప్రజానీకానికి పరీక్ష పెడుతుంది. భగభగమండే పరిస్థితులను కల్పించి ఒకఆట ఆడించిచూస్తుంది. ఆ ఆటే మారణ హోమాలు, కత్తులు నూరుకోవటాలు, తుపాకులు పేల్చుకోటాలు, కనబడిన మని షిని నిలువునా కాల్చివేయటాలు, బాంబులతో పెద్దపెద్ద నగరాలను జీవకోటితో సహా పేల్చివేయటాలుగా రూపొందుతుంది.

అన్నివిధాలుగా అభివృద్ధిచెందిన నగరమొకటి మాడి మసిబొగ్గయి పోతే ఎన్నిలక్షలు- ఎన్నికోట్లు నష్టం దేశానికి ? ఎంత జననష్టం? ఎన్ని అభివృద్ధి కార్యక్రమాలు ఎంత కృషి మట్టిపాలైపోతాయి ?

అటువంటి సంఘటనే జరిగింది. చైతన్య కోర్టునుంచి ఇంటికి వచ్చేసరికి. ఎవరో - ఎక్కడో. రెండిళ్ళసందున బాంబుపెట్టారు. ఆ బాంబు చుట్టుపక్కల ఎనిమిది అంతస్తుల మేడలన్నిటినీ మండించి, పేల్చి, తునాతునకలుచేసి మాడ్చి మసిచేసింది.

చైతన్య ఇంటిలోని వారందరూ బల్లముందరకూర్చుని కాఫీ సేవిస్తున్న సమయమది. ఎక్కడివాళ్ళక్కడే-ఎక్కడి సామానక్కడే - తునాతునకలై మాడి మసిబొగ్గులుగా మారిపోయాయి. తలమీద చేతులుపెట్టుకుని, ఈగదీ కాదని ఆగదీ, అది కాదని హాలులోకి రక్షణకోసం పరుగెత్తి నేలకూలేరు అందరూ. ఆ దగ్గమైనఇంట్లో పనికివచ్చేవస్తువు ఏదీలేకుండా నాశనమైపోయింది.

ఆ ప్రాంతానికి సమీపంగా, గుండెమీద చేతులువేసుకుని నిర్విణ్ణుడై నిలబడి పోయాడు చైతన్య.

ఇంకా మంటలు ఆరలేదు. ప్రయత్నాలు జరుగుతున్నాయి. చల్లారిన తరువాత మాడి మసిబొగ్గయిన ప్రదేశాలనుండి ఒక్కొక్క శవాన్నే పెళ్ళగించి తీస్తున్నాడు. ఏ తలుపు బాగుందని తెరవబోతాడు? ఎటుపక్క బాగుందని లోపలికి ప్రవేశించబోతాడు? లోపలి ఏముందని వెతుకుతాడు? చైతన్య కొయ్య బొమ్మలాచూస్తూ నిలబడ్డాడు.

"ఇట్లా జరిగిఉండవచ్చు - అట్లా జరిగిఉండవచ్చు" అన్న ఊహలేగాని - వాస్తవంగా ఆ సంఘటన ఎట్లా మొదలయిందో కంటితోచూసినవారు లేరు.

రెండుమూడు రోజులు ఆ దగ్గమైన ప్రదేశాలను చుట్టిముట్టిచూస్తూ, పోలీసుల చర్యలనూ అగ్నిమాపక దళాలకృషినీ గమనిస్తూ, అధికారుల అందాజులను వింటూ వీధివీధీ తిరిగాడు చైతన్య. ప్రతి వీధిలోనూ వినాశకరమైన దృశ్యాలే ఎదురయ్యాయి. నిద్రాహారాలను విస్మరించి ఊరంతా తిరుగుతుండగా అతడి కారును ఎవరో మంటల్లోకి నెట్టివేశారు. అది పెద్దచప్పుడుచేస్తూ బద్దలయి ముక్కలు ముక్కలుగా అంత దూరానికి విసిరినట్టుగా పడ్డాయి.

ఇక మిగిలిందేమిటి?

అతడు కట్టుబట్టలతో మిగిలాడు.

ఆరోజే ఒక క్లయింటు రెండువేల రూపాయలిచ్చాడు. ఆ క్లయింటు ఎన్ని సంవత్సరాలుగానో ఓడిపోయి ఎంతో నష్టపడి చివరకు చైతన్య చేతికిచ్చాడు తన కేసును. ఆరు నెలలలోపల అతడి కేసును గెలిపించాడు చైతన్య. ఆ క్లయింటు సంతోషాతిరేకంలో ఇచ్చిన ఫీజది. "అయ్యా ఆస్తిఅంతా దీనికోసం పోగొట్టు కున్నాను. నేను తమకు ఎంతఇచ్చినా మీ ఋణంతీరదు. దీనినే పాతికవేలుగా భావించి స్వీకరించండి" అన్నాడు.

చైతన్య ఎప్పుడూ ఎవరిపట్ల ఫీజు విషయంలో కచ్చితంగాఉండడు. దారిలో అనుకున్నాడు-"నాన్ననూ అమ్మనూ తీర్థయాత్రలు చేయించాలనుకున్నాను. దూరపుయాత్రలు చేయలేకపోయినా దగ్గరగాఉన్న ప్రదేశాలుచూసి ఆనందిస్తారు. ఈ డబ్బు వాళ్ళకు" అనుకున్నాడు.

అయిపోయిందా కోరికకూడా. తీరకుండానే వ్యర్థమయి పోయింది.

ఆకలిదప్పిక లెరుగకుండా ఆ నగరమంతా తిరిగాడు. మంటల్లోనుంచి, కాలిపోయిన ఇండ్లలో గోడలక్రింద పడిఉన్నశవాలను ఫుట్‌పాత్‌మీద పడుకో బెడుతున్నారు.

ఆకలి అంటే-ఆకలి మంటలంటే తెలియని చైతన్యకు తెలియవచ్చాయి. పిల్లలు వృద్ధులు యువజనులు ఆకలిమంటలకు ఓర్చుకోలేక అలమటించి పోతున్నారు.

తానిక ఆ దృశ్యాలను చూడలేడు. ఆ నగరంలో ఉండలేడు. అది స్మశాన తుల్యం.

కన్న తల్లిదండ్రులు. తను కన్న పసిబిడ్డలు-వలచి వలపించుకుని ఒకరి కొకరు ప్రాణంగా మెలగిన భార్య ఈ నగరానికి - ఈ మారణ హోమానికీ బలై పోయిన తరువాత తన కింకేమి మిగిలింది?

తన ఆర్జన ఎవరికొరకు?

తనిక కోర్టుకు వెళ్ళలేడు.

పెద్దలు చెప్పగా విన్నమాట-స్వంత ఊరిలో శిథిలమైపోతున్న భవన మొకటుంది. పది ఎకరాలవరకూ కాలవఒడ్డున పొలమున్నదని.

ఆ ఊరిపేరు అడుగుతూ వెతుక్కుంటూ వచ్చాడు.

ఇక్కడమాత్రం తలదాచుకోవటానికి ఇల్లు ఉన్నదా? వాకిలి ఉన్నదా? శిథిలమై నేలమట్టమయిపోయిన భవనం కళ్ళకు గత వైభవాన్ని మెరిపించిందొక క్షణం.

అక్కడ కొందరు ఏ ధాన్యం లభ్యమయితే వాటితోనే కడుపులు నింపు కుంటున్నారు. రాగులు జొన్నలు సజ్జలు ఏవిదొరికితేఅవే కొనుక్కుపోతున్నారు. వాటితో గటక చేస్తుకుని, రాగులు సజ్జలుతో రొట్టెచేసుకుని తింటున్నారు.

ఆ గ్రామంలో తన కలవాటయిన రెండు జొన్నరొట్టెలు కొనుక్కున్నాడు. వాటినే రెండు రోజులుతిని, స్వచ్ఛమైన కృష్ణానదీ జలాలను కడుపునిండాతాగేడు.

ఆ రెండు మూడు రోజులలో నదిఒడ్డున మట్టితో గోడలులేపి చెట్లకొమ్మలతో కప్పి ఒకగదిని తయారుచేసుకున్నాడు. అది ఆరేవరకూ కోటునుపరచుకుని చెట్టుక్రింద పడుకున్నాడు. రోజూ జొన్నరొట్టెలు కొనుక్కుని తినేవాడు. క్రమంగా ఆ గది ముందర ఒక పంచనుదింపాడు. ఇంటిచుట్టూ కొబ్బరిచెట్లువేశాడు. అరటిచెట్లు పెరటివైపునవేశాడు. అవి కాపుకువచ్చిన తరువాత అపక్వాహారానికి అలవాటు పడ్డాడు.

కొత్తజీవితం! మోడువారిన జీవితానికివి చాలవాఅనుకున్నాడు. ఈ జీవితాని కొక కార్యక్రమ మేర్పరచుకున్నాడు.

కాలువఒడ్డున పంటలు పండించుకుంటూ బ్రతికేరైతులు వెన్నెల వచ్చి నప్పుడు ఒడ్డున ఆడుతూ పాడుతూ సగం రాత్రివరకూ కాలక్షేపం చేసేవారు. అదిచూసిన చైతన్యకు ఆహ్లాదకరంగా ఉండేది.

వాళ్ళ మనసులో సంతోషం పరవళ్ళు తొక్కుతూఉంటే చైతన్య ఆశ్చర్య పడేవాడు.

ఏస్థితిలోఉన్నా మనిషిలో ఆనందం ఉంది. తృప్తి ఉన్నది.

మరి-దేనివల్ల ప్రజలు వారిలోవారు కత్తులు దూసుకుంటారు?

దేనివల్ల దేశాన్ని మంటలుమండించి బూడిదరాసులుగా మారుస్తున్నారు?

అసూయా ద్వేషాలను ఎందుకు పెంపొందిస్తున్నారు?

వాటికి దాసులవుతున్నారు ఎందుచేత? ఎందుకు కసినిపెంచుకుని కక్షను సాధిస్తున్నారు?

కోరిక! కోరిక! కోరిక!

అదే ఆశ! ఆశ! ఆశ!

యుగయుగాలనుండీ మానవుడు ఈ ఒక్క కోరికనూ చంపుకోలేక ప్రపంచా న్నంతటినీ తానొక్కడే ఆక్రమించుకోవాలనే ఆశతో తోటి మానవులను హింసి స్తున్నాడా? జాతిని నశింపచేస్తున్నాడా?

ఆశ! హింస! రెండూ తోడుదొంగలు.

శాస్త్ర విజ్ఞానాన్ని అనుభవంలోకి తెచ్చుకుని నాగరికుడైన మానవుడు ఆశను హింసనూ నశింప చేయలేడా?

ఎందుకు చేయలేక పోతున్నాడు?

స్వార్థం! స్వార్థం! స్వార్థం!

ఇదే యుగయుగాల సమస్య.